# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

శుక్రవారం | 29 ఆగస్టు , 2025 | పేజీలు : 06


## ప్రతీ విద్యార్థి క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : ప్రతి విద్యార్థి క్రీడల పట్ల ఆసక్తి పెంచుకొని క్రీడల్లో రాణించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి పిలుపునిచ్చారు. జాతీయ క్రీడా దినోత్సవం మరియు హాకీ మాంత్రికుడు ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకొని గురువారం ఆమె మిర్యాలగూడ శాసన సభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి తో కలిసి జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి మేకల అభినవ్ స్టేడియం వరకు నిర్వహించిన జాతీయ క్రీడా దినోత్సవ రన్ ను జండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ క్రీడల వల్ల మానసిక, శారీరక దారుఢ్యం పెంపొందుతాయని, అంతేకాక క్రీడలతో ఉపాధి ,ఉద్యోగ అవకాశాలు పొందవచ్చని, చురుకుగా పనిచేసేందుకు క్రీడలు ఉపయోగపడతాయని అన్నారు. రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి మమ్మద్ అక్బర్ అలీ, గృహ నిర్మాణ శాఖ పిడి రాజ్ కుమార్, డిపిఓ వెంకయ్య పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, మిర్యాలగూడ ఎమ్మెల్యేలు క్రీడాజ్యోతిని వెలిగించారు.

# సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులది కీలకపాత్ర

### కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్




**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు కీలకపాత్ర పోషిస్తారని జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ అన్నారు. విద్యార్థులు దారితప్పకుండా క్రమశిక్షణతో చదువుకునేలా చూడాలని కోరారు. గురువారం సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ సమావేశ మందిరంలో ఎంఇఓలు, కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో అత్యవసర సందర్భాలలో తప్పించి సోమ, మంగళవారాలు ఉపాధ్యాయులు తప్పనిసరిగా నూటికి నూరు శాతం హాజరు కావాలని ఆదేశించారు. అదేవిధంగా మిగతా రోజులలో టీచర్ల హాజరు శాతం పెంచాలని దీనితోపాటు విద్యార్థుల హాజరు శాతం కూడా పెంచేందుకు కృషి చేయాలన్నారు. సెప్టెంబర్ 1 నుండి ప్రతిరోజు 9, 10 తరగతి విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహించాలని సూచించారు. అలాగే 6, 7, 8 తరగతుల విద్యార్థులకు ప్రగతి గ్రూప్‌పేరిట అదనపు తరగతులు నిర్వహించాలన్నారు. ప్రతి పాఠశాలలో ప్రతి విద్యార్థి 10 రోజులు తెలుగు చదివించాలని, మరో 10 రోజులు మంచిగా రాయించాలని, చివరి 10 రోజులు బేసిక్ మ్యాథ్స్ చేసే విధంగా ప్రణాళిక సిద్ధం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. వీటిలో ప్రతిభ చూపెట్టిన విద్యార్థులకు బహుమతులు ఇచ్చి ప్రోత్సహించేందుకు ప్రతి కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్‌కు రూ.3వేలు మంజూరి చేస్తామని చెప్పారు. కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ నెలలో 15 రోజులు తనిఖీ చేయాలని ఈ తనిఖీలో ఎఫ్ఎల్ఎన్, ఎల్ఐపి లపై అలాగే విద్యార్థులచే తెలుగు, ఇంగ్లీష్ చదివించాలని కోరారు. 9, 10 తరగతుల విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి గరిష్టంగా 90 శాతం మార్కులు, కనిష్టంగా 70 శాతం మార్కులు సాధించే విధంగా ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. విద్యార్థులకు అదనపు నోట్‌బుక్స్, పాఠ్య పుస్తకాలు, అదనపు యూనిఫామ్‌లు అవసరముంటే తనదృష్టికి తీసుకవస్తే అందజేస్తామని చెప్పారు. తాను సందర్శించిన పాఠశాలల్లో ఐఎఫ్‌పి ప్యానల్ ఉపయోగించిన పాఠశాలల్లో విద్యాబోధన బాగుందని ప్రతి విద్యార్థికి ఇంగ్లీషులో ఒకాబులరీలో భాగంగా కీలకపదాలు నేర్పించాలని సూచించారు. శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాలను గుర్తించి వాటిని ఖాళీ చేయించి వేరే భవనంలో పాఠశాలలో నిర్వహించాలని, ఎక్కడైన టాయిలెట్స్ అవసరముంటే ఉపాధి హామీ పథకం ద్వారా నిర్వహిస్తామని చెప్పారు. ఏకో క్లబ్‌లో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి అశోక్, కోఆర్డినేటర్లు జనార్థన్, శ్రావణ్‌కుమార్, రాంబాబు, పూలమ్మ, ఎంఇఓలు, కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్లు పాల్గొన్నారు.

## ప్రసవాల సంఖ్య పెంచాలి

### నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/నార్కెట్ పల్లి:** ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలలో ప్రసవాల సంఖ్యను పెంచాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. గురువారం ఆమె నార్కెట్ పల్లి ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపి,ఏఎన్‌సి,మందుల స్టాక్ రిజిస్టర్‌లను పరిశీలించిన అనంతరం ప్రసవాలు, గర్భిణీస్త్రీల సంఖ్య, ఏఎన్ సి పరీక్షలు, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు.పిహెచ్‌సిలలో సాధారణ ప్రసవాలను పెంచాలని చెప్పారు. కుక్క కాట్ల వివరాలను సైతం జిల్లా కలెక్టర్ అడిగారు.ప్రజలు వీధికుక్కల బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తల పై అవగాహన కల్పించాలని, కుక్క కాటుకు గురైన వారికి రేబిస్ వ్యాధి సోకకుండా యాంటీ రేబిస్ వ్యాక్సిన్ సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. గ్రామపంచాయతీ సహకారంతో కుక్కలకు స్టెరిలైజేషన్ చేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు.మండలంలో ఇందిరమ్మ ఇండ్ల పురోగతి తక్కువగా ఉన్నందున గ్రౌండింగ్ ను పెంచాలని చెప్పారు.అంతకు ముందు జిల్లా కలెక్టర్ జాతీయ కుటుంబ ప్రయోజన పథకం దరఖాస్తులను అడిగి తెలుసుకున్నారు. కాగా నార్కెట్ పల్లి మండలంలో మొత్తం 308 మరణాలు సంభవించగా, జాతీయ కుటుంబ ప్రయోజన పథకానికి 158 దరఖాస్తులు రావడం జరిగిందని, వాటిని పరిశీలిస్తున్నట్లు తహసిల్దార్ ఎంపీడీవోలు జిల్లా కలెక్టర్‌కు వివరించారు.తహసిల్దార్ వెంకటేశ్వరరావు, ఎంపీడీవో ఉమేష్ ఉన్నారు.

### సెప్టెంబర్ 1వ తేదీ నుంచి

# కొత్తకార్డులకూ సన్నబియ్యం

### నల్లగొండ జిల్లాలో మొదటిసారి బియ్యం తీసుకోనున్న 44,099 లబ్ధిదారులు

### ఏళ్లనాటి కల నెరవేరుతుండడంతో లబ్ధిదారుల హర్షం



**ప్రజాపక్షం/నల్లగొండ** : నల్లగొండ జిల్లాలో రేషన్ కోసం ఏళ్ల తరబడి ఎదురుచూ స్తున్న వారి కల నెరవేరనుంది.సెప్టెంబర్ 1వ తేదీ నుంచి సన్న బియ్యం అందజేసేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. అయితే ఇటీవల కొత్తగా రేషన్ కార్డులు మంజూరైన వారికి కూడా సన్నబియ్యం అందించేందుకు యంత్రాంగం సిద్ధమవుతోంది. కొత్తగా కార్డులు వచ్చిన వారికి సెప్టెంబర్ నెల నుంచి రేషన్ బియ్యంతో పాటు ప్రభుత్వ పథకాలు కూడా అందనున్నాయి. దీంతో లబ్దిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.అదేవిధంగా రేషన్ కార్డులు జారీ చేయడంతో పేదలకు సమస్యలు తీరనున్నాయి. రేషన్ కార్డులేక ప్రభుత్వం ఇచ్చే ఉచిత బియ్యానికి దూరం కావడం తోపాటు పిల్లల చదువుల విషయం లోనూ ఇబ్బందులు ఎదురయ్యాయి. అంతే కాక ప్రభుత్వం ఏ సంక్షేమ పథకం పెట్టినా దానికి రేషన్‌కార్డు తప్పనిసరి చేయడంతో చాలా మంది ఆ పథకాలకు దూరమయ్యారు. అంతే కాక ప్రభుత్వం ఆరోగ్యశ్రీ ద్వారా ఇచ్చే వైద్య సేవలను కూడా పొందలేక ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం కార్డులు జారీ చేయడంతో వారి సమస్యలు తీరనున్నాయి.

**కొత్తగా 65,749 కార్డులు మంజూరు**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నల్లగొండ జిల్లాలో కొత్తగా 65,749 కార్డులను మంజూరు చేసింది. 82,364 మంది పేర్లను కార్డుల్లో కొత్తగా నమోదు చేసింది. తొలుత మే 20వ తేదీ వరకు మీసేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకున్న అర్హులకు పౌరసరఫరాల అధికారులు కార్డులు మంజూరు చేసింది. దాంతో జూన్, జూలై, ఆగస్టు మాసాలకు సంబంధించిన బియ్యం జూన్లోనే ఒకేసారి ఇచ్చారు. దీంతో జిల్లాలో అప్పటి వరకు ఉన్న కార్డులతో పాటు కొత్తగా కార్డులు పొందిన 21,649 మంది సన్న బియ్యం తీసుకున్నారు. మే 20 తేదీ తరువాత రేషన్ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అప్పటి నుంచి ఈనెల 13వ తేదీవ రకు కొత్తగా మరో 44,099 కార్డులను మంజూరు చేసింది. అయితే వీరు జూన్, జూలై, ఆగస్టు మాసా ల్లో కార్డులు పొందినప్పటికీ రేషన్ తీసుకునే అవకాశం దక్కలేదు. దాంతో సెప్టెంబర్ 1 నుంచి ఇచ్చే కోటాలో కొత్తరేషన్ కార్డుదారులు మొదటిసారిగా సన్న బియ్యం తీసుకోనున్నారు. జిల్లాలో రేషన్ దుకాణాలు 991,పాత కార్డులు 4,62,554,కొత్తకార్డులు 65,749,మొత్తం 5,28,303 కగా గతంలో బియ్యం కోటా 89.15 లక్షల క్వింటాళ్లు,సెప్టెంబర్ నెల నుంచి కేటాయింపు 94.04 లక్షల క్వింటాళ్లు సన్న బియ్యం పంపిణీ చేందుకు ఇప్పటికే సంబంధిత అధికారులు రేషన్ షాపులకు బియ్యాన్ని సరఫరా చేస్తున్నారు.

# 102 వాహనాల అమ్మఒడి సేవలు గర్భిణులకు అండ..

**ప్రజాపక్షం/యాదాద్రి :** యాదాద్రి జిల్లా కేంద్రంగా 102 అమ్మఒడి వాహనాలు నిరంతరంగా అద్భుతమైన సేవలను అందిస్తున్నాయి. గర్భిణీ స్త్రీలను ప్రతి నెల జిల్లాలో ఉన్న ప్రతి ఒక్క ప్రాథమిక కేంద్రానికి సరైన సమయానికి యాంటీనేటల్ చెక్ అప్‌కి తీసుకు వెళ్లి మరియు జాగ్రత్తగా ఇంటికి చేర్చడంలో కీలక పాత్ర వహిస్తున్నాయి. అంతేకాకుండా కాన్పు అనంతరం ఆసుపత్రి నుండి డిశ్చార్జ్ అయి వెళ్లేటప్పుడు తల్లిని బిడ్డను ఇద్దరిని క్షేమంగా చేర్చడంలో ముందు వరుసలో ఉంటున్నాయి. గర్భిణీ స్త్రీల యొక్క అవసరాలను తీర్చడంలో 102 అమ్మఒడి వాహనాలు ముందుంటాయి. ప్రతి సబ్ సెంటర్‌కు సంబంధించి గర్భిణీ స్త్రీల యొక్క వివరాలను 102 వాహనాల సిబ్బందికి తెలియజేస్తారు. సరైన సమయంలో వారిని ఆసుపత్రికి తీసుకువచ్చి చికిత్స అందేలా చూస్తూ ప్రతి నెల పరీక్షలు మందులు అందించడంలో ఆసుపత్రికి తీసుకురావడం ద్వారా అక్కడ వైద్య అధికారులు సరైన సమయానికి ప్రతి నెల గర్భిణీకి పరీక్షలు చేయడం వలన సరైన సమయానికి సలహాలు సూచనలు తెలియజేయడానికి దోహదపడుతున్నాయి. ఇంత అద్భుతంగా గర్భిణీ స్త్రీలను తరలించడంలో 102 వాహనాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. జిల్లా కేంద్రంలో భువనగిరి, ఆలేరు, చౌటుప్పల్, రామన్నపేట, తుర్కపల్లి, మోత్కూరు ఆరు వాహనాలు సేవలు అందిస్తున్నాయి. గత ఆరు నెలలుగా చూసుకుంటే ప్రతి నెల చెకప్‌లు మరియు కాన్పు తర్వాత ఇంటికి తరలించడంలో 102 వాహనాలుసేవలు అందించిన వివరాలు చూస్తే మార్చి నెల 652,
ఏప్రిల్ 590, మే 630, జూన్ 550, జూలై 600, ఆగస్టు 570 గర్భిణీ స్త్రీలకు సేవలు అందించారు. కావున ప్రతి ఒక్కరు గ్రామాల నుంచి హాస్పిటల్‌కి వెళ్లేటప్పుడు చెక్ అప్‌కు వెళ్లడానికి 102 అమ్మఒడి వాహనాల సేవలను తప్పనిసరిగా వినియోగించుకుంటే దీని వలన సరైన సమయంలో గర్భిణీగా ఉన్నప్పుడు చికిత్స అందడం వలన తల్లి, బిడ్డలు క్షేమంగా ఉంటారు. కావున ప్రతి ఒక్క గ్రామంలో ప్రజలు 102 వాహనాల సేవలను తప్పనిసరిగా వినియోగించుకోవాలి.

**యాదాద్రి జిల్లాప్రోగ్రాం మేనేజర్ షేక్ సలీం**

గర్భిణీ స్త్రీల ఆరోగ్య సమస్యలు రాకుండా తల్లి బిడ్డ ఇద్దరు క్షేమంగా కాన్పు కావడంలో 102 వాహనాల పాత్ర అనేది కీలకంగా పోషిస్తుంది. మా ముందున్న లక్ష్యం గర్భిణీ స్త్రీలకు సరైన సమయంలో మెరుగైన చికిత్స అందించడమే.

**యాదాద్రి జిల్లా 102 అధికారి మహేష్ కుమార్ కోఆర్డినేటర్ ఇంచార్జ్**

గర్భిణీ స్త్రీలకు సరైన సమయానికి నాణ్యమైన వైద్యం అందించడంలో 102 వాహనాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. మునుముందు కూడా ఇలాగే అమ్మఒడి వాహనాల సేవలను నిరంతరం అందించడంలో ముందు ఉంటాయని తెలియజేశారు.





## ఉద్యాన పంటల రైతులకు రాయితీ

**ప్రజాపక్షం/మునగాల :** ఉద్యాన పంటలు సాగుచేసే రైతులకు ప్రభుత్వం రాయితీ ఇవ్వడం జరుగుతుందని జిల్లా ఉద్యాన పట్టుపరిశ్రమల అధికారి తీగల నాగయ్య అన్నారు. గురువారం మండలంలోని మొద్దులచెర్వు గ్రామంలో సాగవుతున్న ఉద్యాన పంటలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ తక్కువ కాలంలో ఎక్కువ ఆదాయాన్ని అందించే ఉద్యాన పంటలను రైతులు సాగుచేసి అధిక ఆదాయాన్ని పొందాలని కోరారు. పండ్లు, కూరగాయలు, ఇతర వాణిజ్య, ఉద్యాన పంటల సాగుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నాయన్నారు. ఉద్యాన విస్తరణ అధికారులు రంగు ముత్యంరాజు, యానాల సుధాకర్ రెడ్డి, వంగూరి అనిల్‌రెడ్డి, రైతు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## అమరులకు నివాళి



**ప్రజాపక్షం/మునగాల :** 2000 సంవత్సరంలో నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వ హయాంలో ఉమ్మడి రాష్ట్రంలో విద్యుత్ ఉద్యమంలో అసువులు బాసిన అమరవీరులకు సిపిఎం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. గురువారం మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండల కార్యదర్శి బుర్రి శ్రీరాములు మాట్లాడుతూ విద్యుత్ చార్జీల పెంపుకు నిరసనగా 9 వామపక్ష కమ్యూనిస్టు పార్టీల ఆధ్వర్యంలో హైద్రాబాద్ నడిబొడ్డున బషీర్‌బాగ్‌లో చేపట్టిన పోరాటంలో కాల్చి చంపడం జరిగిందన్నారు. నాటి ఉద్యమంలో బాలస్వామి, విష్ణువర్ధన్, రామకృష్ణారెడ్డిలు ప్రాణాలు అర్పించారని గుర్తు చేశారు. వారి త్యాగాల ఫలితంగా నాటి ప్రభుత్వం దిగివచ్చిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు షేక్ సైదా, బచ్చలకూరి స్వరాజ్యం, చందా చంద్రయ్య, బి కృష్ణారెడ్డి, స్టాలిన్ రెడ్డి, గడ్డం వినోద్, శ్యాంసుందర్ రెడ్డి పాల్గొన్నారు.

## మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి

**ప్రజాపక్షం/ రామన్నపేట:** హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడాదినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాలీబాల్ ఇంటర్ కాలేజీ టోర్నమెంట్‌ను పీడీ ఎం.రవీందర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రామన్నపేట, వలిగొండ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాహత్ ఖానం మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల శారీరక మానసిక దారుఢ్యానికే కాకుండా మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయని అన్నారు. పోటీలో రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మొదటి స్థానంలో నిలవగా పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ పి.వెంకటేశ్వర్లు, చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.



## అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు



**ప్రజాపక్షం/చివ్వెంల :** అర్హులైన అందరికి ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు ప్రభుత్వం మంజూరి చేస్తుందని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డిలు అన్నారు. గురువారం మండలంలోని తుల్జారావుపేట గ్రామంలో బానోత్ సంధ్య, షేక్ నజీరాబేగం, కీత లావణ్యకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు మంజూరి చేయగా వారు భూమి పూజ చేశారు. అనంతరం గ్రామంలో ప్రభుత్వం మంజూరి చేసిన నూతన రేషన్ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇండ్లు మంజూరైన వారు సకాలంలో నిర్మాణం పూర్తి చేసుకొని, ప్రభుత్వం విడుతల వారీగా అందించే రూ.5లక్షల ఆర్థిక సహాయాన్ని పొందాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూరుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ధరావత్ వీరన్న నాయక్, మాజీ జడ్పిటిసి చింతమల్ల రమేష్, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్, సూర్యాపేట పట్టణ అధ్యక్షుడు యండి అంజద్ అలీ, దండు మైసమ్మ దేవస్థానం చైర్మన్ కరుణాకర్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ చెన్నోజు నర్సింహాచారి, డిసిసి ఆర్గనైజింగ్ సెక్రటరీ వెన్నా మధుకర్ రెడ్డి పాల్గొన్నారు.

## టార్ఫాలిన్ కప్పతూ ప్రమాదవశాత్తు కిందపడి వ్యక్తి మృతి



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** పోచంపల్లి పట్టణ కేంద్రం లక్ష్మణ్ నగర్ కాలనీలో విజేత యూత్ క్లబ్ ఆధ్వర్యంలో వినాయక చవితి సందర్భంగా గణపతి విగ్రహాన్ని ప్రతిష్టించేందుకు ఏర్పాటు చేసే మండపానికి టార్పాలిన్ కవర్ కప్పుతూ ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందిన విషాద సంఘటన బుధవారం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం మృతుడు భూదాన్ పోచంపల్లి పట్టణానికి చెందిన పోతగల్ల సతీష్ (40) నవరాత్రుల సందర్భంగా ఒక గుత్తేదారు ద్వారా మండపం ఏర్పాటు పనులకు కూలి పనిమీద వచ్చి క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కర్రల మండపం పైకి ఎక్కి ప్లాస్టిక్ కవర్ కడుతూ ప్రమాదవశాత్తు క్రింద పడిపోయాడు. తలకు తీవ్ర గాయాల పాలైన మృతున్నీ వెంటనే అత్యవసర చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న పోచంపల్లి ఎస్సై పోలీస్ బృందం సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకొని ఆసుపత్రికి వెళ్ళి పంచనామా చేసి మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. దీంతో మృతుని ఇంట్లో పండగ పూట విషాదఛాయలు అలముకున్నాయి. కాగా మృతునికి కొడుకులు ఉన్నారు.రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా మండపం తడిగా ఉండటం వల్ల జారిపడినట్లు ప్రాథమిక కారణం అంటున్నారు.మృతుని బాధిత కుటుంబానికి న్యాయం చెయ్యాలని బంధువులూ కులపెద్దలు మండపం వద్ద ఆందోళన చేశారు. నిర్వహకులు బాధిత కుటుంబానికి సహాయం చేస్తానని చెప్పడంతో ఆందోళన విరమించారు. కుటుంబ పెద్దను కోల్పోవడంతో భార్యాపిల్లల రోదనలు మిన్నంటాయి.

## ప్రయత్నాలు మానుకోవాలి



**ప్రజాపక్షం/తుంగతుర్తి :** భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధులను ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు మళ్లించే ప్రయత్నాలు మానుకోవాలని సిఐటియు నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలో గురువారం జరిగిన భవన నిర్మాణ కార్మిక సంఘం మండల మహాసభలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అనంతుల మల్లయ్య, ఎలక సోమయ్య గౌడ్ ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ దశాబ్దాల పోరాట ఫలితంగా సాధించుకున్న 1996 భవన నిర్మాణ కార్మిక చట్టంను సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు కంపెనీల ఆధ్వర్యంలో కాకుండా నేరుగా వెల్ఫేర్ బోర్డు నుండే సంక్షేమ పథకాలు కార్మికులకు అందించాలన్నారు. బషీర్‌బాగ్‌లో విద్యుత్ పోరాటంలో మరణించిన అమరవీరులకు సభ ప్రారంభానికి ముందు నివాళులర్పించారు. అనంతరం నూతన మండల కమిటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా బోయిని మల్లయ్య, అధ్యక్షుడిగా యలగందుల రమేష్, ఉపాధ్యక్షులు చెడిపాక వెంకన్న, పోలెపాక కమలాకర్, ప్రధాన కార్యదర్శిగా బొంకూరు జలేందర్, సహాయ కార్యదర్శులుగా జిలకర పరుశురాములు, చింతకుంట్ల సురేష్, కోశాధికారిగా కరిమల శేఖర్ తదితరులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో లకావత్ బాలాజీ, మల్లెపాక నాగేష్, మల్లెపాక సోమయ్య, వంగాల శేఖర్, గండు ఉపేందర్, షేక్ అబ్బాస్, సతీష్, యాదగిరి, వెంకటేశ్వర్లు, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

## అభ్యంతరాలపై దరఖాస్తు

**ప్రజాపక్షం/చింతలపాలెం :** 2వ విడత సాధారణ గ్రామ పంచాయితీ ఎన్నికలు 2025కు సంబంధించి వార్డుల వారీగా ముసాయిదా ఓటర్ జాబితాను, పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాను మండల పరిషత్ కార్యాలయంలో ప్రచురితం చేయడం జరిగిందని ఇందులో అభ్యంతరాలు ఉన్నవారు ఈనెల 28 నుండి 30వ తేదీ వరకు రాతపూర్వకంగా గ్రామ పంచాయితీ కార్యదర్శులకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడిఓ ఎన్ భూపాల్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో కోరారు. వాటిని పరిశీలించి సెప్టెంబర్ 2వ తేదీన తుది జాబితా విడుదల చేస్తామని చెప్పారు.



## బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా అంతటి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సూర్యాపేట బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీలక్ష్మి బాలాజీ జ్యూయలర్స్ యజమాని అంతటి విజయ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయనతోపాటు ప్రధాన కార్యదర్శిగా మన్యం సింహాద్రి, కోశాధికారిగా బోర్లె మధుసూదన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన అంతటి విజయ్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ బులియన్ మర్చంట్స్, స్వర్ణకారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రతి ఒక్కరు వినియోగదారుల నమ్మకానికి అనుగుణంగా తమ వ్యాపారాన్ని కొనసాగించాలని కోరారు. తన ఎన్నికకు సహకరించిన సభ్యులందరికి ఆయన పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం మాజీ అధ్యక్షులు గునగంటి రాములు, అంతటి రాములు, చీకూరి వెంకన్న సన్స్, బోనగిరి ఉపేందర్, అంతటి కృష్ణ, శ్రీనివాసాచారి, ఆకుల రాజేష్ రెడ్డి, మామిడి హరీష్, సతీష్‌రెడ్డి, విజయకుమార్‌లు పాల్గొన్నారు.

## అక్కినేని పుట్టినరోజు వేడుకలు



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ప్రముఖ సినీ హీరో అక్కినేని నాగార్జున పుట్టినరోజు వేడుకలు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో గురువారం యువసామ్రాట్ అక్కినేని నాగార్జున ఫ్యాన్స్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జి నరేందర్ నాయుడు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అఖిల భారత చిరంజీవి యువత రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బైరు వెంకన్న గౌడ్ చేతుల మీదుగా రోగుల బంధువులకు అల్పాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మెగస్టార్, యువ సామ్రాట్, సూపర్‌స్టార్, పవర్ స్టార్ అభిమానులు మర్రి రాజశేఖర్, ఎల్గూరి రాంబాబుగౌడ్, నాగరాజు, సూరి, మాస్, సతీష్ పాల్గొన్నారు.

## గణపయ్య ఆశీస్సులు ప్రజలపై ఉండాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** గణపయ్య ఆశీస్సులు ప్రజలపై ఉండాలని కాంగ్రెస్ పార్టీ సూర్యాపేట పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ కౌన్సిలర్ చెంచల శ్రీనివాస్ నాయుడు అన్నారు. గురువారం పట్టణంలోని జమ్మిగడ్డలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు నవరాత్రి ఉత్సవాలను ఐక్యతతోపాటు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకుడు నిఖిల్ నాయుడు, యూత్ కమిటి సభ్యులు నవీన్, పృధ్వీ, మహేష్, మల్సూర్, చింటు, సాయి పాల్గొన్నారు.

## యూరియా అందించాలి



**ప్రజాపక్షం/తుంగతుర్తి :** రైతాంగానికి సరిపడా యూరియా అందించాలని బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ సీతయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులు వరినాట్లు వేసుకొని యూరియా కోసం పడిగాపులు కాచే పరిస్థితి కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏర్పడిందన్నారు. గురువారం యూరియా కొరతను నివారించి రైతులకు అవసరమైన యూరియాను అందించాలని మండల కేంద్రంలోని రైతుసేవా సహకార సంఘం వద్ద రైతులతో కలిసి సిఇఓ యాదగిరికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు దొంగరి శ్రీనివాస్, గాజుల యాదగిరి, గుండగాని దుర్గయ్య, బోయిని భాస్కర్, నాగయ్య, ఉప్పల నాగమల్లు, పరిపూర్ణ నాయక్ పాల్గొన్నారు.



## మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

**ప్రజాపక్షం/నల్లగొండ :** వినాయక చవితి పండుగకు మట్టి వినాయకులనే పూజించి పర్యావరణన్ని కాపాడాలి డిఎస్‌పి శివరాం రెడ్డి అన్నారు. జగిని టెక్స్‌టైల్స్,జగిని దంత వైద్య శాల ఆధ్వర్యంలో స్థానిక హైదరాబాద్ రోడ్ లో ఏర్పాటుచేసిన శిబిరంలో మట్టి వినాయకులను డిఎస్‌పి శివరాం రెడ్డి,సిఐ రాజశేఖర్ రెడ్డి,ట్రాఫిక్ సిఐ లక్ష్మయ్య లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నవీన్,రవి,మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.

## నేడు రాస్తారోకో

**ప్రజాపక్షం/మునుగోడు:** సకాలంలో రైతులకు యూరియా సరఫరా చేయకుండా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని ఖండిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో శుక్రవారం మునుగోడు మండల కేంద్రంలో రైతులతో రాస్తారోకో నిర్వహిస్తున్నాట్లు సిపిఐ మండల కార్యదర్శి చాపల శ్రీను తెలిపారు ఈ రాస్తారోకో కార్యక్రమానికి సిపిఐ మండల నాయకులు,రైతులు అధిక సంఖ్యలో పాల్గొలని కోరారు.

## సమాజ సేవకే జీవితం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** సమాజ సేవకే తన జీవితం అంకితం చేస్తానని సామాజికవేత్త, ఫెయిత్‌బంజారా ఆశ్రమ నిర్వాహకులు ధీరావత్ హన్యానాయక్ అన్నారు. సంఘసంస్కర్త మదర్‌థెరిస్సా జయంతిని పురస్కరించుకోని గురువారం వృద్ధులు, వికలాంగులు, యాచకులకు అల్పాహారం, పండ్లు పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘ సంస్కర్తలను ఆదర్శంగా తీసుకోని సమాజసేవకు శ్రీకారం చుట్టానన్నారు. దాతల సహకారంతో 200 మంది నిరుపేదలు, వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు బియ్యం, సరుకులు అందించడం జరిగిందన్నారు. అదే విధంగా జేమ్స్ బాండ్ ప్రధమ వర్ధంతి సందర్భంగా బంజారా ఆశ్రమ చిన్నారులకు పెన్నులు, పెన్సిళ్లు, నోట్‌బుక్స్, కేక్‌లు, మిఠాయిలు, చాక్లెట్లు పంపిణి చేసి అన్నదానం చేశారు. కార్యక్రమంలో కుటుంబసభ్యులు రామారావు, ప్రసాద్‌రావు, ఆశ్రమ నిర్వాహకులు రమాబాయి, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

## జాబితా విడుదల

**ప్రజాపక్షం/చండూరుః** ఎలక్షన్ కమిషన్ ఆదేశామేరకు గురువారం చండూరు మండల ఎంపిడిఓ కార్యాలయం నోటీస్ బోర్డుపై మండలంలోని అన్ని గ్రామ పంచాయితీల వార్డుల వారిగా డ్రాఫ్ట్ ఫోటో ఎలెక్టోరల్ రోల్స్ పోలింగ్ స్టేషన్‌ల జాబితాను ఎంపిడిఓ కార్యాలయంలోని నోటీస్ బోర్డులపై ఉంచడం జరిగిందని చండూరు ఎంపిడిఓ యాదగిరి ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని రాజకీయ పార్టీలతో ఈ నెల 30న మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని ఈ సమావేశంలో మండలంలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొని అభ్యంతరాలు ఉంటే తెలపాలని సూచించారు.



## ఇద్దరు కళ్ళు నలుగురికి చూపు



**ప్రజాపక్షం/ నలగొండ టౌన్ :** పట్టణంలోని దేవరకొండ రోడ్డు లో నివాసం ఉంటున్న అలుగుబెల్లి సుజాతమ్మ గురువారం తెల్లవారుజామున మృతి చెందారు. సుజాతమ్మ నుండి నేత్రదానం ద్వారా కార్నియా అను కంటి పొరలను సేకరించారు.ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ లయన్ కె వి ప్రసాద్, ఐఎంఏ పట్టణ అధ్యక్షులు డాక్టర్ దామర యాదయ్య, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ హరనాథ్ లు మాట్లాడుతూ ఈ కార్నియా పొరల ద్వారా ఇద్దరు నుండి నలుగురు కార్నియల్ అంధులకు చూపు ప్రసాదించవచ్చు అని, ఈ సందర్భంలో కుటుంబ సభ్యులు సమాజానికి ఆదర్శంగా నిలిచారని తెలిపారు. ఇప్పటివరకు 175 నేత్రదానాల ద్వారా 350 కార్నియాలను సేకరించి, 350 మందికి పైగా కార్నియల్ అంధులకు చూపుని ప్రసాదించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ గోలి అమరేందర్ రెడ్డి, లయన్స్ క్లబ్ ఆఫ్ రాయల్ కార్యదర్శి సుధాకర్ రెడ్డి,ఐఎంఏ సభ్యులు, డాక్టర్ పుల్లారావు,ప్రనూష, డాక్టర్ నితీష, చిరునోముల చంద్రశేఖర్, కోట సరిత తదితరులు ఉన్నారు.

## భాష, జయనందం కుటుంబాలకు పరామర్శ



**ప్రజాపక్షం/పెద్దఆడిశర్లపల్లి:** మండల పరిధిలో మృతి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు గోసంగి భాష,పదవీ విరమణ పొందిన జేఎల్‌ఎం నూనె జయనందం కుటుంబ సభ్యులను దేవరకొండ శాసనసభ్యుడు నేనావత్ బాలు నాయక్ గురువారం పరామర్శించారు.అంగడిపేట గ్రామానికి చెందిన జయనంద్ మృతి తెలుసుకుని భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అదేవిధంగా గత కొద్ది రోజుల క్రితం పావురాల గట్టుకు చెందిన గోసంగి భాష చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ప్రతాప్ రెడ్డి,గుడిపల్లి మాజీ సర్పంచ్ శీలం శేఖర్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఎల్లయ్య,కుక్కల గోవర్ధన్ రెడ్డి,నె ర్మటి సతీష్ రెడ్డి,వెంకట్ రెడ్డి,శ్రీకాంత్ యాదవ్,చంద్రారెడ్డి,వీరమల్ల పరమేష్,పాండు నాయక్,నాగేష్ యాదవ్ తదితరులు ఉన్నారు.

## మాదగోని నర్సన్న ఆశయ సాధన కోసం కృషి



**ప్రజాపక్షం/చండూరుః** భారత కమ్యూనిస్టు పార్టీ ముద్దుబిడ్డ బడుగు మలహీన వర్గాల ఆశాజ్యోతి పేద ప్రజల గుండేల్లో నిలిచిపోయిన అమరజీవి కామ్రేడ్ మాగోదగోని నర్సన్న అని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నల్పరాజు రామలింగయ్య అన్నారు.అగస్టు 28 కామ్రేడ్ నర్సన్న 26వ వర్ధంతిని పురష్కరించుకొని చండూరు మండలం బంగారిగడ్డ చౌరస్తాలో ఉన్న నర్సన్న స్థూపానికి రామలింగయ్య పార్టీ నాయకులతో కలిసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామలింగయ్య మాట్లాడుతూ చిన్న వయస్సులోనే ఎర్రజెండా చేతపట్టి తుది శ్వాస వరకు ఎర్ర జెండా నీడలోనే ఉంటూ నమ్మిన సిద్దాంతం కొరకు పాటుపడిన గొప్ప నాయకుడు నర్సన్న అన్నారు. సిపిఐ గ్రామ శాఖ అధ్యక్షుడు పల్లె నర్సింహ్మా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి పల్లె యాదయ్య , జిల్లా పార్టీ కౌన్సిల్ సభ్యుడు తిప్పర్తి రాములు , మాజీ జడ్‌పిటిసి మాదగోని విజయలక్ష్మి , మండల పార్టీ కార్యవర్గ సభ్యులు దోటి వెంకన్న, కర్నాటి వెంకటేశం ,బండమీది వెంకన్న , సిహెచ్ ఊషయ్య , గంట రమేష్ , గీత పనివారల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పల్లె శంకరయ్య , ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు మాదగోని అరుణ్ గౌడ్, పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారం కోసమే మార్నింగ్ వాక్



ఎమ్మెల్యే బాలునాయక్

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** ప్రజల సమస్యల పరిష్కారం కోసమే జనహిత ఎంఎల్ఏ మార్నింగ్ వాక్ విత్ పిపుల్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు దేవరకొండ ఎంఎల్ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. గురువారం మార్నింగ్ వాక్‌లో భాగంగా ఎంఎల్ఏ అధికారులు, నాయకులతో కలిసి కొండమల్లేపల్లి పట్టణంలో పర్యటించారు. సిసి రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజి, మంచినీటి సరఫరా, వీధి లైట్లు, ఇందిరమ్మ ఇండ్లు, పెన్షన్ల మంజూరు కోసం ప్రజలు ఎంఎల్ఏకు వినతి పత్రాలు అందజేశారు. చిన్న చిన్న సమస్యలను అధికారులతో మాట్లాడి అక్కడికక్కడే పరిష్కరించారు. బిసి బాలికల పాఠశాల, కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి వసతులను పరిశీలించి, విద్యార్థులతో ముచ్చటించారు. అంబేద్కర్ నగర్‌లో కొండమల్లేపల్లిలో 40 సంవత్సరాల నుండి నివాసం ఉంటున్న పేద ముస్లీం నిరంజన్ కుటుంబానికి అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి ఇల్లు మంజూరు చేశారు. కాంగ్రెస్ యువ నాయకుడు ఖదీర్‌కు మంజూరు అయిన ఇందిరమ్మ ఇల్లుకు భూమి పూజ చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాబోయే మూడు సంవత్సరాలలో కూడా మార్నింగ్ వాక్ చేసి నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్నటువంటి ప్రజల సమస్యలను పూర్తిగా పరిష్కరిస్తామని అన్నారు. ఈకార్యక్రమంలో మాజీ మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా, మార్కెట్ కమిటి చైర్మన్ నాయిని జమున మాధవరెడ్డి, మాజీ ఎంపిపి దూదిపాల రేఖ శ్రీధర్‌రెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ డా. వేణుధర్ రెడ్డి, పార్లమెంట్ కో ఆర్డినేటర్ సిరాజ్‌ఖాన్, మాజీ వైస్ ఎంపిపి కాసర్ల వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ కుంభం శ్రీనివాస్‌గౌడ్, మాజీ జెడ్పిటిసి సలహాదారుడు పసునూరి యుగేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## గామ పంచాయతీ ఎన్నికల ముసాయిదా అభ్యంతరాలపై సమావేశం

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** గ్రామ పంచాయతీ ఎన్నికల ముసాయిదా ఫోటో ఓటర్ల జాబితాపై, ముసాయిదా పోలింగ్ స్టేషన్ల వివరములకు సంబంధించిన విషయములపై చర్చించుటకు ఈ నెల 30న మండల స్థాయి, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశo ఏర్పాటు చేయనున్నట్లు ఎండిఓ రాపర్తి భాస్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమీషన్, హైద్రాబాద్ నోటిఫికేషన్ విడుదల చేసిన నేపథ్యంలో పోచంపల్లి మండల గ్రామ పంచాయతీ ఎన్నికలు 2025 నిర్వహణపై చర్చించేందుకు అన్ని పార్టీల అధ్యక్షులు మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసే సమావేశంలో పాల్గొనాలని తెలిపారు. 28న అన్ని గ్రామ పంచాయతీలు, మండల ప్రజా పరిషత్తు కార్యాలయము యందు ప్రదర్శించినట్లు పేర్కొన్నారు. అభ్యంతరాలను స్వీకరించి తుది ఓటర్ల జాబితా 31న ప్రదర్శించనున్నట్లు వెల్లడించారు.

## తాగునీటి సమస్య పరిష్కరించాలి



**ప్రజాపక్షం/ రామన్నపేట:** మండలంలోని కొమ్మాయిగూడెం గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను అధికారులు తీర్చాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి వారు మాట్లాడారు. గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి బోర్లు వేయాలని, కుక్కల బెడదతో అనేక మంది గాయాలపాలవుతున్నారని వెంటనే వాటి బారిన కాపాడాలన్నారు. గ్రామంలో డ్రైనేజీ అధ్వాన్నంగా ఉండి ప్రజలు రోగాల భారిన పడుతున్నారని వెంటనే పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలన్నారు. సమస్యను పరిష్కరించకపోతే ఈనెల 30న తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపడ్తామన్నారు. కార్యక్రమంలో శానగొండ వెంకటేశ్వర్లు, ఎర్ర రవీందర్, ఎర్ర కాటమయ్య, అంతటి నర్సింహా, నాగయ్య, సాగర్ల శేఖర్, నవీన్‌రెడ్డి, ఎర్ర రామలక్ష్మ య్య తదితరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మిక సంఘం మండల మహాసభ విజయవంతం చేయండి



**ప్రజాపక్షం/ రామన్నపేట:** భవన నిర్మాణ కార్మిక సంఘం మండల 11వ మహాసభను విజయవంతం చేయండని సంఘం జిల్లా అధ్యక్షుడు గొరిగె సోములు అన్నారు. గురువారం మండలంలోని ఆయన మండలంలోని సిరిపురం, వెల్లంకి, ఇంద్రపాలనగరం, బోగారం, కక్కిరేణి గ్రామాల్లో కార్మికులతో మాట్లాడి మండల మహాసభ కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. మండలంలో భవన కార్మిక రంగంలో పనిచేస్తున్న కార్మికులు ప్రతి ఒక్కరు ఈ మహాసభలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో బడె సత్తయ్య, కోట సంధ్యారాణి, వెంకన్న, కన్నెబోయిన యాదయ్య, బోడ శంకరయ్య, జానయ్య, మధు, సత్తయ్య, లింగయ్య, పద్మ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## పేద కుటుంబానికి ఆర్థిక సాయం



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** మండల పరిధిలోని కొల్ ముంతల్‌పహాడ్ గ్రామ పంచాయతీ మంత్ర్యతండాకు చెందిన ఆంబోతు హరి హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మరణించాడు. నిరుపేద కుటుంబం కావడంతో హరి అంత్యక్రియలకు పిఏసిఎస్ చైర్మన్ డా. వేణుధర్‌రెడ్డి స్పందించి రూ. 5వేలను ఖర్చుల నిమిత్తం మాజీ సర్పంచ్ రవినాయక్‌తో వారి కుటుంబానికి అందజేశారు. హరి ఆత్మకు శాంతి చేకూరాలని వారి కుటుంబ సభ్యులకు అండగా ఉంటానని తెలిపారు.

# ఏడాదిన్నరలోపే 27వేల మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఏడాదిన్నరోలోపే 27వేల మందికిపైగా ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికి దక్కుతుందని బంజారా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ మాలోతు దశరద్‌నాయక్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో సైతం ఇవ్వని విధంగా తెలంగాణ రాష్ట్రంలో ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించి విద్యాశాఖకు ఆయనకు ఉన్న శ్రద్ధను నిరూపించుకున్నారని అన్నారు. అదేవిధంగా ఉద్యోగ, ఉపాధ్యాయుల అన్ని రకాల పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని అన్నారు. సమావేశంలో గోపినాయక్, మక్లానాయక్, సైదానాయక్, జామ్లానాయక్, శ్రీనునాయక్, రమేష్, లాలు, హరి, కోట్యా, నెహ్రూ, మంగ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

# కాల్వలో పడి బాలుడి మృతి



**ప్రజాపక్షం/కోదాడ రూరల్** : మండలంలోని గణపవరం గ్రామానికి చెందిన కుక్కడపు మనోహర్ (11) అనే బాలుడు బుధవారం మధ్యాహ్నం తన స్నేహితులతో కలిసి గ్రామ శివారులోని చెరువు వద్ద పంట కాల్వలో చేపలు పడుతూ ప్రమాదవశాత్తు కాల్వలోకి జారిపడి మృతి చెందాడు. తండ్రి కుక్కడపు నాగేశ్వర్ రావు ఫిర్యాదుమేరకు రూరల్ ఎస్ఐ సిహెచ్ గోపాల్ రెడ్డి కేసు నమోదు చేసి ధర్యాప్తు జరుపుతున్నారు.

# ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణానికి శంకుస్థాపన



**ప్రజాపక్షం/చండూరు:** చండూరు మున్సిపల్ కేంద్రంలో అసంపూర్తిగా ఉన్న ప్రెస్ క్లబ్ భవనం నిర్మాణానికి గురువారం ఈ ఎల్ వి ఫౌండేషన్ ఆద్వర్యంలో వారి సొంత ఖర్చులతో భవన నిర్మాణాన్ని చేపట్టే కార్యక్రమంలో భాగంగా ఈ ఎల్ వి ఫౌండేషన్ చైర్మన్ ఇరుగుదిండ్ల భాస్కర్ గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ చండూరు ప్రెస్ క్లబ్ భవనాన్ని మూడు నెలలలో పూర్తి చేసి మండలంలోని ప్రింట్ ఆండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు అందజేస్తానని తెలిపారు. ఈకార్యక్రమంలో ప్రింట్ ఆండ్ ఎలక్ట్రానిక్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

# ముసాయిదా ఓటర్ల జాబితా

**ప్రజాపక్షం/ రామన్నపేట:** స్థానిక ఎంపీడీవో కార్యాలయం, గ్రామపంచాయతీ కార్యాయలంలో ముసాయి ఓటర్ల జాబితా వార్డుల ప్రకారం ప్రదర్శించడం జరిగిందని ఎంపీడీవో రాములు గురువారం తెలిపారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 30 వరకు తెలియచేయాలన్నారు.



# విద్యార్థులకు ఉచితంగా షూ పంపిణీ

**ప్రజాపక్షం/గుండాల:** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అనంతారం, సుద్దాల, సీతారంపురం, వెల్మజాల గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలలో గురువారం ఎంఎల్‌సి తీన్మార్ మల్లన్న తన కుమార్తె చింతపండు సక్పాల్ పటేల్ 7వ జన్మదినం పురస్కరించుకొని పాఠశాలలోని విద్యార్థులకు సొంత ఖర్చులతో ఉచితంగా షూలను పంపిణి చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఎంఎల్‌సి మల్లన్న మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులకు మేరుగైన, నాణ్యమైన విద్య లభిస్తుందని అన్నారు. విద్యార్థులు ప్రతి రోజు పాఠశాలలకు వచ్చి ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాలను వింటూ, ఇష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను ఏర్పర్చుకొని వాటిని సాధించే విధంగా కృషి చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు. ఈసందర్భంగా మండల విద్యాశాఖ అధికారి మన్నె అగ్గిరాములు



ఎంఎల్‌సి మల్లన్నను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బిసి పొలిటికల్ జేఏసి కోఆర్డినేషన్ కమిటి చైర్మన్ సుధగాని హరిశంకర్‌గౌడ్, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ గడ్డమీది పాండరి, మండల విద్యాశాఖ అధికారి అగ్గిరాములు, ఎస్ఐ తేజంరెడ్డి, బిసి పొలిటికల్ జేఏసి సమన్వయకర్తలు నర్సయ్య, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యంతోనే యూరియా కొరత



**ఆలేరు, భువనగిరి మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునిత, పైళ్ల శేఖర్ రెడ్డి**

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్** : యూరియా కొరత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యమేనని ఆలేరు భువనగిరి మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీత మహేందర్ రెడ్డి, పైళ్ల శేఖర్ రెడ్డి ఆరోపించారు. గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతుంటే సీఎం రేవంత్‌రెడ్డికి కనబడడం లేదా, చెవులు వినపడడం లేదా నీకు పరిపాలన చేతకాక పోతే సీఎం పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఒక్క రైతుకు యూరియా ఇబ్బంది లేకుండా పంపిణీ చేయడం జరిగిందని, కేసీఆర్ పాలనలో ప్రతి సీజన్లోనూ అధికారులతో సమీక్షలు చేస్తూ విత్తనాలు, ఎరువులు, కరెంట్, ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. పదేండ్ల పాలనలో ఎప్పుడూ లేని యూరియా కొరత ఇప్పుడు ఎందుకు వచ్చిందని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రైతులు పొలం పనులను పక్కనపెట్టి యూరియా కోసం రోడ్డు ఎక్కాల్సిన దుస్థితి వచ్చిందని మండిపడ్డారు.

# మేళ్ళవాయి గ్రామంలో డ్రైనేజీ సమస్య తీర్చాలి

**ప్రజాపక్షం/ నాంపల్లి:** మండల పరిధిలోని మేళ్ళవాయి గ్రామంలో సిపిఐ(ఎం) మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సమస్యలపై సర్వే గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి నాంపల్లి చంద్రమౌళి మాట్లాడుతూ వరుసగా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రజలు సీజనల్ మురికి నీరు నిల్వ ఉండడంతో ఈగలు, దోమలు ప్రబలి ప్రజలు రోగాల బారిన పడుతున్నారని స్థానిక ప్రజా ప్రతినిధులు లేక అభివృద్ధి కుంటుపడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కొత్త కుంటలు అక్రమ తవ్వకాలను తక్షణమే ఆపాలని అన్నారు. మేల్లవాయి నుండి తుమ్మలపల్లి వరకు తారు రోడ్డు నిర్మించాలని ఆయన కోరారు. అదేవిధంగా డబుల్ రోడ్డు పనులు మెల్లవాయి నుండి మల్లేపల్లి వరకు త్వరితగతిన పూర్తి చేసి రాకపోకలకు ఇబ్బంది కలగకుండా చూడాలని ఆయన అన్నారు. ఇందిర మైండ్ ల



బేస్మెంట్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని గ్రామాలలో ఇందిరమ్మ ఇఃడ్లు అర్హులైన వారందరికీ రాజకీయ ప్రమేయం లేకుండా ఇవ్వాలని అన్నారు.ఈ కార్యక్రమం లో సిపిఎం మండల కమిటీ సభ్యులు కొమ్ము లక్ష్మయ్య, అందుగుల రాములు, తిరుమలేష్, కొమ్ము భిక్షమయ్య, కసిపాక వేలాద్రి, కొమ్ము రాములు, కొమ్ము వెంకటయ్య, కుందేళ్ళ ఈదయ్య,బొడ్డుపల్లి లింగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ(ఎం) మహా ధర్నాను జయప్రదం చేయండి




**ప్రజాపక్షం/చౌటుప్పల్** : చౌటుప్పల్ మండల వ్యాప్తంగా ప్రజలు ఎదురుకుంటున్న సమస్యలు పరిష్కరించాలని, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని కోరుతూ వచ్చే నెల సెప్టెంబర్ (1)న చౌటుప్పలమండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహా ధర్నాలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక కందాల రంగారెడ్డి స్మారక భవనం నందు సిపిఎం చౌటుప్పల్ మండల కమిటీ సమావేశం జిల్లా కమిటీ సభ్యులు రాగిరి కిష్టయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా కృష్ణారెడ్డి పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి గంగాదేవి సైదులు, మండల కార్యదర్శి వర్గ సభ్యులు తడక మోహన్, చింతల సుదర్శన్, బోయ యాదయ్య, మండల కమిటీ సభ్యులు అంతటి అశోక్ పాల్గొన్నారు.

# నేడు డిండిలో ఎమ్మెల్యే మార్నింగ్ వాక్

**ప్రజాపక్షం/డిండి;** జనహిత ఎంఎల్‌ఏ మార్నింగ్ వాక్ విత్ పీపుల్ కార్యక్రమంలో భాగంగా దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ శుక్రవారం డిండి మండల కేంద్రంలో పాల్గొననున్నారు. ప్రజా సమస్యల పరిష్కారంకై వార్డుల్లో ప్రజల సమస్యలు తెలుసుకొని తక్షణం పరిష్కారం అయ్యే సమస్యలు అధికారులతో అక్కడే మాట్లాడి ఎంఎల్‌ఏ పరిష్కారం చూపనున్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పరిశీలించనున్నారు. ఎంఎల్‌ఏ మార్నింగ్ వాక్ కార్యక్రమం విజయవంతానికై పార్టీ నాయకులు, కార్యకర్తులు హాజరు కావాలని డిండి మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొంతినేని వెంకటేశ్వర్‌రావు, మండల పార్టీ అధ్యక్షులు నల్లవెల్లి రాజేష్‌రెడ్డిలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

# గ్రామ పంచాయతీ ఎలక్షన్స్ డ్రాఫ్ట్ ఓటర్ జాబితాలు విడుదల



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** గ్రామపంచాయతీ ఎలక్షన్ల 2025 సంవత్సరం సంబంధించి తుర్కపల్లి మండలంలోని 33 గ్రామపంచాయతీలలోని 266 వార్డులకు ఎన్నికల నిర్వహనకై గ్రామపంచాయతీ డ్రాఫ్ట్ ఓటర్ జాబితాను మరియు ముసాయిదా పోలింగ్ స్టేషన్ల జాబితాను గురువారం మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి లెంకల గీతారెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో మొత్తం 266 పోలింగ్ స్టేషన్స్‌లు, 27977 ఓటర్స్ ఉన్నారని, పురుషులు 13846, మహిళలు 14131 ఉన్నారని తెలిపారు. తుర్కపల్లి మండలంలోని 33 గ్రామపంచాయతీలలో ఓటర్ లిస్ట్‌ను విడుదల చేయడం జరిగినదని, 28.08.2025 నుండి 30.08.2025వ తేదీ వరకు ఓటర్ జాబితాపై, ముసాయిదా పోలింగ్ స్టేషన్లపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియచేయవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో డి.వెంకటేశ్వర్లు, పర్యవేక్షకులు జె.వినోద్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ పి.ప్రవీణ్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ జహంగీర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# కమ్యూనిటీ సోక్పిట్ నిర్మాణానికి శంకుస్థాపన



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** మండలంలోని జలాల్పూర్ కేజీబీవీ పాఠశాల ప్రాంగణంలో జిల్లా పరిషత్ సీఈవో శోభారాణి గురువారం కమ్యూనిటీ సోక్పిట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని రికార్డులను పరిశీలించి, విద్యార్థులతో కలిసి మదాహ్న భోజనం చేశారు. అనంతరం ఆమె గ్రామంలోని ఇందిరమ్మ హౌసింగ్ పథకం లబ్ధిదారుల గృహాలను సందర్శించి, సమస్యలు, అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ భాస్కర్ ఏపీవో కృష్ణమూర్తి, కస్తూర్బా పాఠశాల ప్రిన్సిపల్ ఇందిర, టెక్నికల్ అసిస్టెంట్ కృష్ణ, పంచాయతీ కార్యదర్శి నరేష్, ఫీల్డ్ అసిస్టెంట్ అమృత, కారోబార్ భార్గవి, పాఠశాల సిబ్బంది, ఇందిరమ్మ హౌసింగ్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

# సురేష్‌కుమార్ మొదటి వర్ధంతి



**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలోని స్థానిక మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డా. సురేష్‌కుమార్ మొదటి వర్ధంతి సందర్భంగా గురువారం పాఠశాల పూర్వ విద్యార్థులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రిన్సిపాల్‌గా డా. సురేష్ కుమార్ పాఠశాలలోని విద్యార్థులతో మరిచిపోలేని అవినాభావ సంబంధం కలిగి ఉండేవాడన్నారు. ఈకార్యక్రమంలో దార సతీష్, ప్రేమ్‌కుమార్, మహేష్, జానీ, ఉపేందర్, లింగం తదితరులు పాల్గొన్నారు.



## దేవరకొండ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జిగా స్నేహ

**ప్రజాపక్షం/దేవరకొండ;** దేవరకొండ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జిగా గురువారం కుమారి స్నేహ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెను మార్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన న్యాయశాఖ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు మాతంగి వీరబాబు, న్యాయశాఖ ఉద్యోగులు, సూపరింటెండెంట్ గిరిధర్, శ్రీనివాస్, అలి, సాబూర్, దేవేందర్, మురళి, మోత్య, శంకర్, రాజు, దినేష్, సబియా తదితరులు పాల్గొన్నారు.

## సుదీప్‌రెడ్డి మృతికి సంతాపం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** రెండు రోజుల క్రితం ఢిల్లీ ఎయిర్పోర్టులో గుండెపోటుతో మరణించిన. రిటైర్డ్ ఎమ్మార్వో మోదుగు శంకర్ రెడ్డి కుమారుడు మోదుగు సుదీప్ రెడ్డి పార్థివ దేహాన్ని గురువారం నల్లగొండలోని వారి నివాసంలో నల్లగొండ మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి సందర్శించి ఘనంగా నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఆయన వెం ట మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి,పట్ట ణ అధ్యక్షులు భువనగిరి దేవేందర్, మాజీ కౌన్సిలర్ రావుల శ్రీనివాస రెడ్డి,మండల పార్టీ అధ్యక్షులు, దేప వెంకటరెడ్డి, ఉమా రెడ్డి తదితరులు ఉన్నారు.

## వినాయకుడికి వినతి



**ప్రజాపక్షం/దేవరకొండ;** రాష్ట్ర ప్రభుత్వం స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని వినాయకుడికి ఎబివిపి దేవరకొండ నగరశాఖ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈసందర్భంగా ఎబివిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఛత్రపతి చౌహాన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పేద మధ్యతరగతి విద్యార్థులకు చెల్లించవలసిన 8500కోట్ల స్కాలర్ షిప్, ఫీజురియంబర్స్‌మెంట్‌లను చెల్లించకుండా ఈ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటంమాడుతుందన్నారు. ఈకార్యక్రమంలో ఏబివిపి నాయకులు గోపిచంద్ పాల్గొన్నారు.

## 31న కుమ్మర సంఘం ఎన్నికలు

**ప్రజాపక్షం/నార్కట్ పల్లి:** తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం వారి నార్కట్ పల్లి మండల,పట్టణ శాఖ ఎన్నికలు ఈనెల 31న నిర్వహించనున్నట్లు అ సంఘం రాష్ట్ర నాయకులు రాధారపు బిక్షపతి,మండల శాఖ అధ్యక్షులు నిమ్మన గోటి వెంకన్నలు తెలిపారు. ఇట్టి ఎన్నికలు ఆదివారం పట్టణంలోని జిఎస్ఆర్ ఫంక్షన్ హాల్ నందు జరుగునున్నట్లు తెలిపారు.పట్టణ శాఖ ఎన్నికలు ఉదయం 9 గంటలకు, మండల శాఖ ఎన్నికలు అదే రోజు ఉదయం 11 గంటలకు జరుగుతాయని తెలియజేశారు.ఈ ఎన్నికల నిర్వహణకు జిల్లా, రాష్ట్ర కమిటీ సభ్యులు విచ్చేయుచున్నారు. కావున నార్కట్పల్లి పట్టణ,మండలంలోని కుమ్మర్లందరూ ఎన్నికల నిర్వహణకు తోడ్పడగలరని వారు కోరారు.

## ప్రధానమంత్రి సురక్షా బీమా యోజనకు నమోదు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకములో పనిచేసే వేతనదారులందరికి ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన (పిఎంఎస్‌బివై) నమోదు చేయించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి వై. శేఖర్ రెడ్డి తెలిపారు.ఉపాధిహామీ పథకములో పనిచేయుచున్న వేతనదారులు అందరికి ఈ భీమా పథకం వర్తింపచేయాలని, దీనికి ఉపాధిహామీ పథకంలో మండలస్థాయిలో పనిచేయుచున్న సిబ్బంది,క్షేత్ర సహాయకులు అందరూ కలిసి ప్రతీ వెతనదారునికి అవగాహన కల్పించి వారి ద్వారా బ్యాంక్ ఫారం నింపించి వారికి ఈ భీమా వర్తించేలా చేయాలని ఆదేశించారు. జరిగింది. దీనిలో భాగంగా జిల్లాలో ఉన్నటువంటి వేజ్ సీకర్స్ 18 నుంచి 70 సంవత్సరాల వయస్సు కలవారందరికి ఈ భీమా యోజన వర్తించే విధంగా సంబంధిత జాతీయ బ్యాంకులు,పోస్టాఫీసులలో ఫారంలు వేతనదారుల నుండి తీసుకోని ఇవ్వాలని తెలియాజేశారు. జాతీయం చేయబడిన బ్యాంకుల నందు (వ్యక్తిగత బ్యాంకు ఖాతా ఉన్నచో) పేరు నమోదు చేయించుకోవాలి, అంతే కాకుండా ఆ బ్యాంకు ఖాతాకు ఆధార్ తో అనుసంధానం అయి ఉండాలని.,బ్యాంకు ఖాతా ఉన్న బ్రాంచ్ నందు ఈ భీమా పథకంలో పేరు నమోదు చెయ్యమని తెలియ చేస్తూ రాత పూర్వక అభ్యర్ధన ఇస్తూ, తమ ఖాతా నుండి ప్రతి సంవత్సరం రూ.20 ఈ భీమా కు జమ చెయ్యమని లేఖను ఇవ్వవలసి ఉంటుంన్నారు.ఒకసారి లేఖ ఇస్తే ప్రతి సంవత్సరం భ్యాంకు వారు రూ.20 ఈ భీమా పథకములో పేరు నమోదు చేయటం జరుగుతుందని ఈ భీమా ప్రతి సంవత్సరం జూన్1వ తేది నుండి మే 31వ తేది వరకు వర్తిస్తుందని పెర్కోన్నారు.ఈ భీమా నందు పేరు నమోదు చేయించుకున్న వారు ఎవరైనా ప్రమాదవశాత్తూ మరణించిన, పూర్తి అంగవైకల్యం కలిగిన వారికి రూ.2లక్షలు నష్ట పరిహారం పొందే అవకాశం ఉంటుంది. ప్రమాదవశాత్తు పాక్షికంగా అంగవైకల్యం కలిగిన రూ.1లక్ష నష్ట పరిహారం పొందే అవకాశం ఉంటుందని తెలిపారు.

## ప్రశాంతమైన వాతావరణంలో నిమజ్జనయాత్ర



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** గణేష్ నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో నిర్వహించే విధంగా అధికారులు అన్ని సదుపాయాలు కల్పించాలని ఆర్‌డిఓ అశోక్ రెడ్డి, నలగొండ డిఎస్‌పి శివరాం రెడ్డి సూచించారు. గణేష్ నిమజ్జనం సందర్భంగా జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాలతో గురువారం ఆర్‌డిఓ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో ఎన్‌ఆర్‌డిఓ కమిటీ సభ్యులతో గణేష్ నిమజ్జన సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఓ, డిఎస్పి మాట్లాడుతూ గణేష్ నిమజ్జన యాత్రను పురస్కరించుకొని లాండ్ ఆర్డర్ సమస్య తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో చూడాలని అదేవిధంగా ఇరిగేషన్ వారికి వాటర్ లెవెల్ తగ్గకుండా చూడాలనిఆదేశించారు.మత్స్యకారుల కు నిమజ్జనం సమయాన గజ ఈత గాళ్లను అందుబాటులో ఉంచాలని అదేవిధంగా మున్సిపాలిటీ అధికారులు శానిటేషన్, ఇతరత్రా ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు.ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్ వారికి కరెంటు తీగలు వంగి ఉన్న వాటిని వెంటనే మరమ్మత్తులు చేసి వినాయకులకు అడ్డం రాకుండా తొలగించాలని సూచించారు. సభ్యులకు నిమజ్జన సమయం లో ఏదైనా అనుకోని సంఘటనలు జరిగినప్పుడు అంబులెన్స్, డాక్టర్ల కొరత లేకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు.గణేష్ ఉత్సవ కమిటీకి ఎటువంటి లోటుబాట్లు లేకుండా అధికారులు వారికి అందుబాటులో ఉంటూ సహకరించాలని కోరారు. అదేవిధంగా అగ్నిమాపక సిబ్బంది కూడా అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిఎంహెచ్ఓ, మున్సిపల్ కమీషనర్, ఆర్‌అండ్‌బి, ఇరిగేషన్ అధికారులు, జిల్లా అగ్నిమాపక అధికారి, ఎలక్ట్రిసిటీ, పోలీస్ అధికారులు, తహశీల్దార్,కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

## సెప్టెంబర్ 4వరకు చేయూత ఆసరా పింఛన్లు పంపిణీ

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** జిల్లాలో వివిధ రకముల చేయూత ఆసరా పింఛన్లు (అనగా వృద్ధాప్య, వితంతు, వికలాంగుల, చేనేత, కల్లుగీత, మరియు ఒంటరి మహిళ పింఛన్లు) పొందె పింఛనుదార్లకు ఈనెల 28 నుండి సెప్టెంబర్ 4వ తేదీ వరకు బట్వాడా చేయబడుతుందని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి వై.శేఖర్ రెడ్డి తెలిపారు. పింఛను దారులు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ముఖ గుర్తింపు సాఫ్ట్ వేర్ ద్వారా పింఛను పొందలన్నారు. 3 నెలలు దాటిన పింఛను తీసుకోని వారికి 4నెలల పింఛను ఇవ్వడం జరుగుతుందన్నారు. పింఛను తీసుకోవడనికి మధ్య దళారీలను నమ్మకుండా నేరుగా సంబంధిత పోస్టల్ శాఖ వారి వద్ద నుండి పొందవలని, పింఛను పొందుటకు ఎటువంటి సొమ్ము చెల్లించవలసిన అవసరము లేదని పెర్కొన్నారు. పింఛను మొత్తము సొమ్ము రూ.16 తో సహా అడిగి తీసుకోవాలని సూచించారు.

## ఓటర్ల తుది జాబితా విడుదల

**ప్రజాపక్షం/ఉండవెల్లి:** మండలంలోని గ్రామపంచాయితీలోని వార్డు నెంబర్లు వారిగా ఓటర్ల తుది జాబితా విడుదల చేసినట్లు ఉండవెల్లి మండల అభివృద్ది అధికారి తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం మండలంలోని 15 గ్రామపంచాయితీ లోను 148 వార్డు నెంబర్లు ఏర్పాటు చేసినట్లు మండలంలోని మొత్తం 22610 ఓటర్లు ఉన్నట్లు వారు తెలిపారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే స్థానికంగా ఉండే సంబంధాధికారిని సంప్రదించాలని వారు సూచించారు.

## ప్రారంభమైన నవరాత్రి ఉత్సవాలు

**ప్రజాపక్షం/బీబీనగర్ :** మండల కేంద్రంలో గోల్డెన్ యూత్ ఫ్రెండ్స్ ఏర్పాటుచేసిన వినాయక మండపం వద్ద ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ భక్తిశ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించుకోవాలని కోరారు. అనంతరం యూత్ సభ్యులు ఎమ్మెల్యేను శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోలి పింగళి రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ మెట్టు శ్రీనివాస్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సురకంటి సత్తిరెడ్డి పాల్గొన్నారు.



## ఓటర్ల జాబితాలో బిఆర్ఎస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాపక్షం/నార్కట్ పల్లి:** స్థానిక సంస్థల ఎన్నికల ఓటర్ల జాబితా రూపకల్పనలో అధికార కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమాలకు పాల్పడే అవకాశముందని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. గురువారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో ఆయన మాట్లాడుతూ స్థానిక ఎన్నికల నేపథ్యంలో బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన సూచనలు ప్రతి నాయకుడు, కార్యకర్త తప్పనిసరిగా పాటించాలని ఆయన కోరారు. ఆగస్టు 31వ తేదీలోగా సంబంధిత ఎంపీడీఓ కార్యాలయంలో అభ్యంతరాలు నమోదు చేయాలని సూచించారు. సెప్టెంబర్ 2న ప్రచురించే తుది జాబితాలో బిఆర్ఎస్ సానుభూతిపరుల ఓట్లు గల్లంతు కాకుండా తిరిగి చేర్చేలా కృషి చేయడం ప్రతి కార్యకర్త బాధ్యత ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరి ఓటు అమూల్యం బిఆర్ఎస్ కార్యకర్తలు, సానుభూతిపరుల ఓట్లు ఉద్దేశపూర్వకంగా తొలగించే ప్రయత్నం చేస్తే కచ్చితంగా అడ్డుకోవాలి.

## తైబజార్ బహిరంగ వేలం

**ప్రజాపక్షం/చండూరు:** సెప్టెంబర్ 3న చండూరు మున్సిపాలిటీకి సంబందిచిన తైబజార్ కు మున్సిపల్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహించడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ మల్లేశం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మల్లేశం మాట్లాడుతూ తైబజార్ బహిరంగ వేలంలో పాల్గొనుటకు నేటి నుండి సెప్టెంబర్ 2వ తేదీ వరకు మున్సిపల్ కార్యాలయంలో పనివేళలో 2వేల రూపాయలు చెల్లించి దరఖాస్తూ ఫారం పొందాలని తెలిపారు. వేలంలో పాల్గొనువారు 25వేల రూపాయలు చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని సూచించారు. ఈ తైబజార్ కాలం 2025 సెప్టెంబర్ నుండి 2026 మార్చి వరకు 7 నెలలు కాలపరిమితి ఉంటుందని తెలిపారు.

## కృష్ణయ్య మృతి బాధాకరం



**ప్రజాపక్షం/డిండి;** డిండి మండలం దాసరి నెమిలిపూర్ గ్రామ శాఖ నాయకులు శిరసనగండ్ల కృష్ణయ్య మృతి బాధాకరం అని బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ ఎంఎల్‌ఏ రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. గురవారం దాసరి నెమిలిపూర్ గ్రామంలో కృష్ణయ్య దశదిన కర్మ కార్యక్రమంలో పాల్గొని కృష్ణయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణయ్య మృతి పార్టీకి తీరని లోటు అని అన్నారు. కృష్ణయ్య కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన వెంట బిఆర్ఎస్ మండల అధ్యక్షులు రాజీనేని వెంకటేశ్వర్‌రావు, పిఏసిఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రావు, ప్రశాంత్‌రావు, మాజీ మండల కో ఆప్షన్ సభ్యులు జహంగీర్ పాల్గొన్నారు.

### గంగిడి వెంకట్‌రెడ్డి మృతి బాధాకరం

**ప్రజాపక్షం/డిండి;** డిండి మండలం దాసరి నెమలిపూర్ గ్రామ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ ధర్మకర్త శ్రీ డా. గంగిడి వెంకట్ రెడ్డి మృతి బాధాకరం అని బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎంఎల్ఏ రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. గురువారం వెంకట్‌రెడ్డి పార్టీవ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షులు రాజినేని వెంకటేశ్వర్‌రావు, ప్రశాంత్ రావు, మాజీ మండల కో ఆప్షన్ సభ్యులు జహంగీర్, విష్ణువర్ధన్ రెడ్డి, ప్రవీణ్‌రావు, వెంకటయ్య, హనుమంతు, బషీర్, తిరుపతయ్య, హనుమంతు, శ్రీను తదితరులు ఉన్నారు.

## అగ్నివీర్ ఉద్యోగాల కోసం దరఖాస్తులు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** భారత సైనిక దళంలో అగ్ని ఏర్ పథకం క్రింద అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ క్లర్క్ గా చేరుటకు భారత సైన్యం వారు ఆన్ లైన్ ద్వారా ధరఖాస్తులను ఆహ్వానిస్తోందని ఆసక్తి గల అభ్యర్థులు అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి నంద పద్మ తెలిపారు. ఇట్టి ఉద్యోగాల అర్హత పొందేందుకు అభర్థి వయస్సు జనవరి 2005 నుండి జులై 2008 మధ్య జన్మించి ఉండాలి, ఇంటర్మీడియట్,డిప్లొమా లో ఏదైనా గ్రూప్ నందు 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత కలిగి ఉండలన్నారు. పూర్తి వివరాలకు 7839126939 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

# గిరిజన గ్రామాల అభివృద్ధికి పటిష్ఠ కార్యాచరణ

## -శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** గిరిజన గ్రామాల అభివృద్ధికి పటిష్ఠ కార్యాచరణ అభివృద్ధి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పిఎం ధర్తీ అబా జన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఎంపిక చేసిన 63 మంది మాస్టర్లకు మూడు రోజుల శిక్షణా కార్యక్రమ ప్రారంభంలో గురువారం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజనుల వికాసానికి, సామాజిక, ఆర్థికాభివృద్ధి కోసం పిఎం ధర్తీ అబా జన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష అభియాన్ కార్యక్రమం రూపొందించడం జరిగిందన్నారు. రాబోయే ఐదేండ్ల పాటు ఈ కార్యక్రమం క్రింద రూ. 79.156 వేల కోట్లు ఖర్చు చేయనుందన్నారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం 70 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం భరిస్తాయన్నారు. ఖమ్మంజిల్లాలో తొమ్మిది మండలాల పరిధిలో 35 గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేయడం జరుగుతుందన్నారు. గ్రామాల్లోని గిరిజన జనాభాకు అందుబాటులో ఉన్న వనరులను పరిశీలించి ఇంకా ఏమేమి వసతులు కావాలో ప్రతిపాదనలు తయారు చేయాలని ఆదేశించారు. జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాల్లో గిరిజన జనాభాకు ప్రధాన మంత్రి అవాస్ యోజన క్రింద పక్కా ఇండ్లు, జల్ జీవన్ మిషన్ క్రింద త్రాగునీరు, ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన క్రింద గ్రామాల్లో రహదారులు ఉండేలా చూడాలన్నారు. పిఎం సూర్యఘర్ పథకం క్రింద గ్రామాల్లో ఆసక్తి గల గిరిజనుల ఇంటిపై సోలార్ విద్యుత్ ప్యానల్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి కుటుంబానికి గ్యాస్ కనెక్షన్, ఆయూష్మాన్ కార్డు అందించాలన్నారు. అవసరమైన చోట అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని, సమగ్ర శిక్షాభియాన్ క్రింద పాఠశాలల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. రోటిన్ కార్యక్రమంలా కాకుండా గిరిజనులకు కావాల్సిన సదుపాయాలు, వసతులు వారే నిర్ణయించుకు నేవిధంగా వారికి సులభతరం చేయాలన్నారు. ప్రతి గిరిజనుడికి విద్య, వైద్యం వంటి కనీస సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో అన్ని శాఖల సమన్వయంతో గిరిజనుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తానని అధికారులతో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు.ఈ సమావేశంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఎన్. విజయలక్ష్మి, డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కళావతిబాయి, జిల్లా సంక్షేమ అధికారి కె. రాంగోపాల్ రెడ్డి, మిషన్ భగీరథ ఇఇ పుష్పలత, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జలదిగ్బంధంలో శ్రీరామ్‌నగర్..!

**- పరిశీలించిన మున్సిపల్ కమిషనర్**
**- ముందే చెప్పిన 'ప్రజాపక్షం'**
**- కాలనీవాసులకు అండగా నిలిచిన సిపిఐ**







**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని వరంగల్‌క్రాస్‌రోడ్‌లో గల శ్రీరామ్‌నగర్‌కాలనీని కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, ఇరిగేషన్ ఈఈ రమేష్‌రెడ్డి గురువారం పరిశీలించారు. గత రెండురోజులుగా కురుస్తున్న వర్షాలతో ఈదుల చెరువు నిండి అలుగు పారి అయోధ్యనగర్, శ్రీరామ్‌నగర్‌లో వరదపోటెత్తింది. అలాగే శ్రీరామ్‌నగర్‌లోకి వెళ్లే ప్రధానరహదారి వద్ద అలుగు కాల్వ రోడ్డుపై నుంచి నీరు




ఉధృతంగా ప్రవహించింది.ఈ నేపథ్యంలో పరిస్థితిని పరిశీలించి, మున్సిపాలిటీ అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

**అండగా నిలిచిన సిపిఐ...**

బుధవారం ప్రారంభమైన వర్షంతో అంతకంతకు పెరుగుతున్న నీటి ఉధృతిపై సిపిఐ ఆధ్వర్యంలో కాలనీవాసులకు అండగా నిలిచారు. సిపిఐ నేత దండి రంగారావు నేతృత్వంలో పార్టీ శ్రేణులు, యువజన సంఘం సభ్యులు రాత్రి, పగలు పర్యవేక్షించారు. ఏదులాపురంమున్సిపాలిటీ అధికారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేశారు. అలాగే తమ సొంత జేసీబీ ద్వారా గండ్లు కొట్టించడంతో నీరు సాఫీగా వెళ్లింది. ముందస్తుగా స్పందించిన తీరుపై కాలనీవాసులు సైతం కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ పరిస్థితులలో చేసిన సహాయ,సహకరాలపై కమిషనర్ అభినందనలు తెలిపారు.

**ముందే చెప్పిన 'ప్రజాపక్షం'**

కాలనీల మునకపై అగస్టు 15న ప్రజాపక్షం దిన పత్రిక వరదొస్తే మునకే అనే కథనాన్ని ప్రచురించింది. అలుగు కాల్వలు కబ్జాపై రాసిన అక్షారాలు అక్షరసత్యం అయ్యాయి. ఈ సమస్య వరదొచ్చిన ప్రతిసారి ఉత్పన్నమవుతున్నందున అధికారులు శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఎంతైన ఉంది.

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాపక్షం/ గుండాల :** భారీ వర్షా దృష్ట్యా ప్రజలు అత్యవసరమైతే తప్పా బయటికి రావద్దని సిఐ రవిందర్, ఇరిగేషన్ ఎఇ పృధ్వి సూచించారు. గురువారం కొడవటంచ వద్ద గల ఏడుమెలికల వాగు, రోల్లగడ్డ వద్దగల మల్లన్న వాగు, కిన్నెరసాని వాగులను సందర్శించారు. సిఐ మాట్లాడుతూ ఉధృతంగా ప్రవహించే వాగులను దాటే సాహసం చేయవద్దని, ముఖ్యంగా పశువులు, మేకలు, గొర్ల కాప రులు వాగులు దాటే ప్రయత్నం చేవద్దని హెచ్చరించారు. రైతులు పొలాల్లో విద్యుత్ మోటార్ల వద్ద జాగ్రతగా ఉండాలని , వర్షం పడేటప్పుడు విద్యుత్ స్థంబాలను గాని వైర్లను గాని ట్రాన్స్ ఫారాలని తాకవద్దని కోరారు. నదీ ప్రవాహాలను వాహనాలను దాటించే ప్రయత్నం చేయవద్దని హెచ్చరించారు.

# విస్తారమైన వర్షాలు..పొంగుతున్న చెరువులు



**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** గత రెండు రోజులుగా కురుస్తున్న విస్తారమైన వర్షాల కారణంగా మండలంలో ఉన్నటువంటి వివిధ గ్రామాలలో ఉన్న చెరువులు పొంగిపొర్లుతున్నాయి. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల అన్నపురెడ్డిపల్లి పంచాయితీ పరిధిలో ఉన్నటువంటి వెంకటాపురం రాళ్లచెరువుకు వరద నీరు చేరడం వలన నిండుకుండల నిండి రహదారిపై పారుగుతుంది. అబ్బుగూడెం గ్రామం పంచాయితీలో ఉన్నటువంటి ఈదుల వాగు అధిక ప్రవాహంతో రహదారిపై ప్రవహిస్తుంది. ఎటువంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా మండలంలోపి ప్రజలను అప్రమత్తం చేయుటకు స్థానిక ఎస్ఐ చంద్రశేఖర్ , రెవిన్యూ సిబ్బంది, పోలీస్ సిబ్బందితో కలిసి వరద ప్రవాహ ప్రాంతాలను సందర్శించి, కట్టుదిట్టమైన చర్యలను చేపట్టారు. రాత్రి వేళలో ప్రయాణికులకు ప్రమాద సూచికలను తెలియపరుస్తూ కానిస్టేబుల్‌తో సెంట్రింగ్ ఏర్పాటు చేశారు. మధ్యాహ్న సమయంలో జూలూరుపాడు సిఐ శ్రీలక్ష్మి మండలంలోని ప్రవాహ ప్రాంతాలను తనిఖీ చేశారు. రాత్రి సమయాలలో వర్షపాతం పెరిగి వరద ఉధృతి వచ్చినప్పుడు ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు సలహాలు తెలియపరిచారు. ఈకార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా వినాయక చవితి ఉత్సవాలు



**ప్రజా పక్షం/ హాలియా:** ఉత్సవాల సందర్భంగా గ్రామాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలని హాలియా సీఐ సతీష్ రెడ్డి, ఎస్సై సాయి ప్రశాంత్ తెలిపారు.

# మట్టి విగ్రహాలను పూజించాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఫౌండేషన్ ఛైర్మన్ శ్రీచరణ్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం మట్టి వినాయక విగ్రహాలను నాణ్యమైన జూట్ బ్యాగ్, వ్రత పుస్తకం ఉచితంగా పంపిణి చేయడం జరిగిందని, పట్టణ ప్రజలు మట్టి విగ్రహాలు ప్రతిష్టించుకోని సుఖసంతోషాలతో, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు మందా వెంకట్, గుత్తికొండ సుదర్శన్‌రెడ్డి, కట్టెబోయిన శ్రీనివాస్, గుడిపాటి వివేక్ యాదవ్, అంబటి శ్రీను, వడ్డెపల్లి వెంకటేష్ పాల్గొన్నారు.

# బోగారం గ్రామంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో



**ప్రజాపక్షం/ రామన్నపేట:** మండలంలోని బోగారం గ్రామంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో కొలువుదీరిన గణనాధుడి నవరాత్రి వేడుకల్లో రెండవ రోజు మాజీ ఎంపీపీ బద్దుల ఉమా రమేష్‌యాదవ్ ప్రత్యేక పూజలు చేసి మాట్లాడారు. కార్యక్రమంలో చిర్రగోని నవీన్, గోగు వెంకటరమణ, బద్దుల నరసింహా, గోగు యాదయ్య, తోల్పూరి వరుణ్, చిర్రగోని సాయికుమార్, మహావీర్, సద్గురు తదితరులు పాల్గొన్నారు.

# మట్టి గణపతికి పూజలు

**ప్రజాపక్షం/నార్కట్ పల్లి:** గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ డి. క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో మట్టి గణపతిని ఏర్పాటు చేశారు. కేవలం క్రిమినల్, తదితర కేసులతో విధులు నిర్వహిస్తూ మానసిక ఒత్తిడికి గురవుతున్న సిబ్బందికి జీవితంలో ఆధ్యాత్మికత కు సమయం కేటాయించలేని పరిస్థితులు లేని నేపథ్యంలో ఎస్సై పోలీస్ స్టేషన్లోనే మహాగణపతి పూజా కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

# బషీర్‌బాగ్ విద్యుత్ పోరాట అమరవీరుల త్యాగాన్ని వృథా కానివ్వం : సాబీర్ పాషా



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** బషీర్‌బాగ్ విద్యుత్ పోరాట అమరుల త్యాగాన్ని వృధా కానివ్వబోమని, వారి పోరాట స్ఫూర్తితో ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుతామని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా అన్నారు. పేద, మధ్య తరగతి వర్గాలు, రైతులకు భారంగా మారిన విద్యుత్‌ఛార్జీల పెంపును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ వామపక్షాలు చేపట్టిన ఛలో అసెంబ్లీ కార్యక్రమం సందర్భంగా బషీర్‌బాగ్ లో అప్పటి ప్రభుత్వం జరిపిన కాల్పుల్లో అమరులైన బాలస్వామి, రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డిలను స్మరిస్తూ వారి చిత్రపటం వద్ద గురువారం సిపిఐ జిల్లా కార్యాలయం శేషగిరి భవన్‌లో నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా పాషా మాట్లాడుతూ పాతికేళ్ల క్రితం జరిపిన విద్యుత్ పోరాటం చారిత్రాత్మకం అని, కమ్యూనిస్టు కార్యకర్తల పోరాటాల స్ఫూర్తిని మరింత పెంచాయన్నారు. పేదల కోసం ప్రాణాలను సైతం పణంగా పెట్టి పోరాడిన స్ఫూర్తి ఎందరికో ఆదర్శం అన్నారు. ఆ అమరుల త్యాగాలతోనే ఉచిత విద్యుత్ పథకానికి అంకురార్పణ జరిగిందని గుర్తు చేశారు. విద్యుత్ పోరాట అమరుల స్ఫూర్తితో ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న పాలకులపై తిరగహబడటానికి ప్రజలను చైతన్య వంతం చేయాలని పిలుపునిచ్చారు.

# పండుగలు ఐక్యతకు వేదికగా నిలవాలి

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** పండుగలు, ఉత్సవాలు ప్రజల మధ్య ఐఖ్యతకు, సోదరభావాన్ని పెంపొందించేందుకు వేదిక కావాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మునిస్పల్ మాజీ వైస్ చైర్మన్ ఎస్‌కే సాబీర్ పాషా అన్నారు. పట్టణంలోని 30వ వార్డు మధురబస్తీలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గురువారం మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన ప్రజలకు శుభా కాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ సంస్కృతి సంప్రదాయాలు ప్రపంచానికే ఆదర్శం అన్నారు. కులమతాలకు అతీతంగా అన్ని పండుగలు కలిసిమెలిసి నిర్వహించుకోవడం మన ప్రాంతానికే కాకుండా యావత్ భారత దేశానికి ఐఖ్యతారాగానికి నిదర్శనంగా నిలుస్తుందన్నారు. గణేష్ ఉత్సవ కమిటీలు ఉత్సవాలు ఘనంగా నిర్వహించుకోవడమే కాకుండా పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం చేపట్టడం, అందర్నీ ఏకతాటిపైకి తీసుకురావడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కందుల భాస్కర్, 30వ వార్డు మాజీ కౌన్సిలర్ నేరెళ్ల సమైఖ్య, నాయకులు పిడుగు శ్రీనివాస్, పీక కృష్ణ, మంచినీళ్ల అజయ్, సుధాకర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.